క్లుప్తంగా

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం



నల్లజర్లలో పేదలకు వస్త్రదానం చేస్తున్న అధ్యక్షురాలు నాగలక్ష్మీదేవి

నల్లజర్ల: ఉగాదిని పురస్కరించుకొని స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచాంగ పఠనం నిర్వహించారు. అభ్యుదయ రైతు నిమ్మలపూడి ప్రసాద్ చేతుల మీదుగా పేదలకు నూతన వస్త్రాలు అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు కడించర్ల నాగలక్ష్మీదేవి, కార్యదర్శి పలివెల పరంజ్యోతి ,సభ్యులు పాల్గొన్నారు. వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ పఠనం జరిగింది. అనంతపల్లిలోని రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలోనూ పంచాంగ పఠనం జరిగింది. రైతులు పాల్గొని తమ తమ పేరు బలాన నూతన సంవత్సర ఫలితాలు అడిగి తెలుసు కున్నారు.

నేడు ఉండ్రాజవరం మండల పరిషత్ సమావేశం

ఉండ్రాజవరం: మండల పరిషత్ పాలకవర్గ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి మంగళవారం తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం



భూమిపూజ చేస్తున్న విశ్వేశ్వరరావు దంపతులు

దేవరపల్లి: గోపాలపురం రోడ్డులోని డైమండ్ జంక్షన్ సమీపంలో పొలాల మధ్య కొలువైన దేవరపల్లి గ్రామ పొలిమేర దేవత ఎంగూడెం నంగాలమ్మ ఆలయ పునఃనిర్మాణానికి గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. దాదాపు రెండు శతాబ్దాల క్రితం గంగాలమ్మ తల్లి ఈ ప్రాంతంలో కొలువు దీరినట్టు గ్రామస్తుల కథనం. కొంతకాలంగా ఈ ఆలయం జీర్ణావస్థకు చేరుకుంది. దాంతో ఆలయ పునఃనిర్మాణానికి గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం ఆర్య వైశ్య సంఘ ప్రముఖ నాయకుడు నారాయణ విశ్వేశ్వరరావు దంపతులు ఆలయ పునఃన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొవ్వూరు: పట్టణంలోని టోల్‌గేట్ జంక్షన్ వద్ద మదర్ థెరిసా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన వేసవి చలి వేంద్రాన్ని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు మంగళవారం ప్రారంభిం చారు. యూనియన్ అధ్యక్షుడు దాసరి రామకృష్ణ, కార్యదర్శి యాసారపు శ్రీనివాస్, కోశాధికారి మల్లాడి డేవిడ్ రాజు, ఇతర కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మంత్రి వనిత ఎన్నికల ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి , రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం దేవరపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ మంగళవారం తెలిపారు. సాయంత్రం 3 నుంచి రాత్రి 10 గంటల వరకూ గౌరీపట్నం, దుద్దుకూరు, బందపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ నాయకుల రిలే దీక్షలు

కొవ్వూరు: కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే సీటును స్థానికులకే కేటాయించాలని కోరుతూ రెండు రోజులుగా పట్టణంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ పార్టీ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు తొక్కుడు ట్రాన్సిస్, కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు జొన్నకూటి రవి, చాగల్లు ఎస్సీ సెల్ అధ్యక్షుడు జల్లా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, మట్టా సుబ్బారావు, పీసీసీ కో-ఆర్డినేటర్ సాకా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు దర్శించుకున్న దుర్గేష్

పెరవలి: జనసేన పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ ఉగాది సందర్భంగా మంగళవారం మండలంలోని ముక్కామల, ముత్యాలవారిపాలెం, ఓదూరివారిపాలెం గ్రామాల్లోని పలు దేవాలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

క్రోధం అంటే ఆగ్రహం కాదు పట్టుదల

- పిల్లలకు ఆచార, సంప్రదాయాలు నేర్పించండి
- ఆచార్య దోర్భల ప్రభాకరశర్మ
- పలుచోట్ల పండితుల ఉగాది పంచాంగ పఠనాలు
- సంప్రదాయబద్ధంగా శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు
- ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు, ఊరేగింపులు



దేవరపల్లిలో గ్రామదేవత కడియాలమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొవ్వూరు: పిల్లలకు ఎప్పటికప్పుడు మన ఆచార, సంప్రదాయాలు నేర్పించాలని ఆచార్య, మహామహోపాధ్యాయ దోర్భల ప్రభాకరశర్మ అన్నారు. శ్రీక్రోధి నామ ఉగాది వేడుకలను కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా మంగళవారం ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయం వద్ద దోర్భల ప్రభాకరశర్మ పంచాగ పఠనం చేశారు. క్రోధం అంటే ఆగ్రహం కాదని, పట్టుదల అన్నారు. పట్టుదలతో పని చేస్తేనే కార్యసిద్ధి ప్రాప్తిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనపై కళాకారులు ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై కళాజాతా నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు ప్రభాకరశర్మ ఆశీర్వచనాలు అందించారు. ఈ వేడుకలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకులు దుర్గమల్లేశ్వరరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ముళ్లపూడి కాశీవిశ్వనాథ్, కంఠమణి రమేష్, మారిన రామకృష్ణ, బోడపాటి హనుమంతరావు, బొర్రా కృష్ణారావు, పోసిన శ్రీకృష్ణ దేవరాయలు, చిట్టూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా మంగళవారం ఉదయం నుంచీ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకూ పంచాంగ పఠనం జరిగింది. గ్రామదేవత కడిమాలమ్మకు ఉగాది ఉత్సవం నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. భక్తులు చలివిడి, పానకాలు సమర్పించి పూజలు చేశారు.



కొవ్వూరులోని ఎమ్మెల్యే తలారి క్యాంపు ఆఫీసు వద్ద దోర్భల ప్రభాకరశర్మ పంచాంగ పఠనం

చాగల్లు: బ్రాహ్మణగూడెంలోని బాల రామలింగేశ్వరస్వామి, చాగల్లు ప్రధాన కూడలిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వద్ద పండితులు పంచాంగ పఠనం నిర్వహించారు. గ్రామపెద్దలు, స్థానికులు అధిక సంఖ్యలో విచ్చేసి ఈ ఏడాది పంటల తీరు, వర్షపాతం వివరాల గురించి శ్రద్ధగా ఆలకించారు. చాగల్లు కనకదుర్గమ్మ వారి, ఊనగట్ల పుంతలో ముసలమ్మ అనే కనక మహాలక్ష్మి వారి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మహిళలు కలశపూజ చేశారు. చాగల్లు కనకదుర్గమ్మ, పాటిమ్మపేటలోని పాటిమ్మ అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. బ్రాహ్మణగూడెం నాగారమ్మ , మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు.



నిడదవోలులో పంచాంగ పఠనం చేస్తున్న ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి

నిడదవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీచైతన్య సాహితీ సమాఖ్య సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పండితుడు ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి చేసిన పంచాంగ పఠనం ఆకట్టుకుంది. అనంతరం ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి, కూచిపూడి నృత్య కళాకారిణి దాసం పావనితో పాటు పలువురు పండితులను సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయంలో..

నిడదవోలు రూరల్: ఉగాది కావడంతో తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బంగారు ఆభరణాలు, ప్రత్యేక పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ పఠనం చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు చక్కెర పొంగలి, పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, అర్చకులు బి.మల్లేశ్వరరావు, శ్రీకంఠం శ్రీనివాస్‌లను పట్టువస్త్రాలతో సన్మానించారు.



కోటసత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు

వేడుకల్లో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, రేలంగి మారుతి శివభాస్కరరావు, ఉర్ల వీర వెంకటలక్ష్మి, బోనేపల్లి ఉమాదేవి, నిచ్చెనకోళ్ల భవాని, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో పంచాంగ పఠనకర్త పీసపాటి పాలశంకర వరప్రసాద్ సిద్ధాంతి ఉండ్రాజవరంలో పంచాంగ పఠనం చేశారు. స్థానిక కొత్తపేటలోని శ్రీగండి పోచమ్మ వారిని, సత్యవాడ శివారు మర్రిపాలెం వంతెన దగ్గర కొలువైన కొండాలమ్మ వారిని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు దర్శించుకుని, పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పాలంగి గ్రామంలో కొలువైన కనకదుర్గమ్మ వారు ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, పులిహోర పంపిణీ చేశారు. వెలగదుర్రులోని విశ్వేశ్వర, మల్లేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో పంచాంగ పఠనం చేశారు. పండితులను సత్కరించారు.

ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువ

పెరవలి: శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రకృతి వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తాయని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ భగవంతుని సేవ చేసుకోవడమే మార్గమని వేద పండితుడు సూరంపూడి ఫణికుమార్ అన్నారు. అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పంచాంగ పఠనం చేశారు. అయితే ఈ ఏడాది రైతుల పంటలకు గిట్టుబాట ధర లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో పయనిస్తే మేలు జరుగుతుందని తెలిపారు. భగవంతుని ఆశీస్సులు ఎక్కడ ఉంటే అక్కడ శాంతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంతం చిన్న, యాళ్ళబండి శ్రీనివాస్, పంతం నాగేశ్వరరావు, ఓసూరి బాలయోగి తదితరులు పాల్గొన్నారు.



బ్రాహ్మణగూడెంలో గ్రామదేవత నాగారమ్మ వారు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలోని జనార్దన స్వామి ఆలయం వద్ద పంచాంగ పఠనం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఆలయ కమిటీ చైర్మన్ యండపల్లి వీరవెంకట సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నా ప్రతి అడుగూ ప్రజా సేవ కోసమే..



ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడికి తాడిమళ్ల వాసుల స్వాగతం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు
- తాడిమళ్లలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో తాను వేసే ప్రతి అడుగూ ప్రజాసేవ కోసమే అని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తనకు ప్రజలు దీవించాలని ఆయన కోరారు. మండలంలోని తాడిమళ్లలో శ్రీనివాస్‌నాయుడు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ మీ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నా, పేదలందరికీ మంచి జరగాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. తాడిమళ్లలో పీహెచ్‌సీ భవనం నిర్మించామని, సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేపట్టామని, అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేశామని వివరించారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీలతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు చింతల రాంబాబు, పార్టీ నాయకులు మానుకొండ చంద్రబాబు, కటికిరెడ్డి నారాయణరావు, కాపకాయల సూర్యనారాయణ, తిరుమళ్ల దుర్గారావు, కొప్పుల రామదేవుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా ప్రచారం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మంగళవారం సాయంత్రం పట్టణంలోని 13వ వార్డు, ఇందిరానగర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు ఇందిరానగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ తదితరులు

కొత్తపల్లి అగ్రహారంలో ఎమ్మెల్యే కుమారుడు..

పెరవలి: మరోసారి తన తండ్రి శ్రీనివాస్ నాయుడిని నిడదవోలు ఎమ్మెల్యేగా గెలిపించాలంటూ ఆయన కుమారుడు వరుణ్ సాయి మండలంలోని కొత్తపల్లి అగ్రహారంలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కోర్ల ఉదయ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు నక్కా పాలేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్, పాలా వెంకటేశ్వరరావు, పంపన అంజిబాబు, సన్నీ తదితరులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.

వనితకు మద్దతుగా మూడు గ్రామాల్లో ప్రచారం

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనితకు మద్దతుగా ఆ పార్టీ మండల నాయకులు మంగళవారం మంగళవారం తెలికిచెర్ల, పడమర చోడవరం, గుండేపల్లి గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్లలో ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని వారు వివరించారు. రానున్న ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, బంక అప్పారావు, సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు, పిచ్చుకుల ప్రసాద్, మద్దూరి విష్ణుమూర్తి, కుంచే విష్ణుమూర్తి, నల్లా రాజు,కరక శ్రీను, బుడిగిన వీవీ సత్యనారాయణ, పద్మారావు పాల్గొన్నారు.



తెలికిచెర్లలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దొండపూడిలో నాగరాజు ఆధ్వర్యంలో..

గోపాలపురం: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మంత్రి తానేటి వనితకు మద్దతుగా ఆ పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు దొండపూడిలో మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించాలని స్థానిక నాయకులకు సూచించారు. మండలంలోని బూత్ కమిటీ, గ్రామ కమిటీ, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి వనితమ్మ విజయానికి కృషి చేయాలన్నారు. ప్రచారంలో సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, నాయకులు బొమ్మా మురళీకృష్ణ, పోల్నాటి సురేష్, ఎంపీటీసీ మారాజు రాజేష్, మండల బీసీ సంఘం అధ్యక్షుడు కాసాని సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి



వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి



టీడీపీ నాయకుడు ధూళిపాళను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తలారి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- కొవ్వూరు 9వ వార్డులో ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 9వ వార్డులో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ప్రతి పేద వాడికీ మేలు చేకూరుతుందన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. నిరంతరం ప్రజలందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ ప్రచారంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, యూత్ అధ్యక్షుడు సిద్దన వాసు, కౌన్సిలర్లు బత్తి నాగరాజు, కంఠమణి రమేష్, తోట లక్ష్మీప్రసన్న, చీర్ల అరుణకుమారిలతో పాటు నాయకులు బావన బెన్నీ, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, మాసా ఆనంద్, బోడపాటి హనుమంతరావు, చిట్టూరి అన్నవరం, గంగాధర నాగేశ్వరరావు, బోడసింగి తులసి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకుడు

పట్టణంలో తొమ్మిదో వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు ధూళిపాళ దక్షిణామూర్తి మంగళవారం స్థానిక వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గతంలో దక్షిణామూర్తి టీడీపీ తరఫున తొమ్మిదో వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, పార్టీపట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాబు మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- ద్వారకాతిరుమల మండలంలో ప్రచారం



ద్వారకాతిరుమల ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: ఎన్నికలు వచ్చినపుడే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి ప్రజలు గుర్తుకొస్తారని, ఆయన మాయమాటలు, బూటకపు హామీలను నమ్మి ఎవరూ మోసపోవద్దని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. మండలంలోని ద్వారకాతిరుమల, గుండుగొలనుకుంట, దొరసానిపాడు గ్రామాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బైక్ ర్యాలీ మధ్య స్థానిక గుడి సెంటర్ నుంచి వనిత ప్రచారం ప్రారంభించారు. వీధివీధికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మంత్రి వనితకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. హారతులిచ్చి, గజమాలలతో సత్కరించారు. భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానుల నడుమ ప్రచారం జో రుగా సాగింది. ప్రచార సభల్లో మంత్రి వనిత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గోపాలపురం ఎమ్మెల్యేగా తనను, రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని మంత్రి వనిత ప్రజలను కోరారు. ప్రచారంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, యిమ్మడి నాగు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, పొనమాల ఉమామహేశ్వరరావు, చిలుకూరి చంద్రం, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చెన్నూరి రామకృష్ణ, అచ్యుత ఏసుబాబు, బొండాడ సత్యకిరావు, పొంగులేటి నాగేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, కుంటం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలు



వేగేశ్వరపురంలో పూజలు అందుకున్న ధనమ్మ వారు



విశేష అలంకరణలో శక్తమ్మ వారు

తాళ్లపూడి: గ్రామదేవతల ఉత్సవాలను మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేగేశ్వరపురం పొలాల్లో వెలసిన ధనమ్మ వారిని ఉదయం నుంచీ గ్రామస్తులు దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే తాళ్లపూడిలోని మోదుగులమ్మ వారి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అమ్మవారి సిరిబొమ్మను గరగ నృత్యాలతో గ్రామంలో ఊరేగించారు. శిరిబొమ్మ ఉత్సవం నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. గజ్జరంలో గ్రామదేవత ముత్యాలమ్మ వారి ఉత్సవాలు నిర్వహించారు. కాగా పెద్దేవం గ్రామదేవత గార్లమ్మ వారి ఉత్సవాలను బుధవారం నిర్వహించనున్నారు.

శక్తమ్మ వారి ఉత్సవాలు ప్రారంభం

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన శక్తమ్మ వారి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు ఏటా ఉగాది రోజున ప్రారంభమై వారం రోజుల పాటు జరుగుతాయి. ఈ ఉత్సవాలకు ఖండవల్లి, ముక్కామల, నల్లాకులవారిపాలెం, పిట్టల వేమవరం, మల్లేశ్వరం, కడింపాడు, వడలి, సిద్ధాంతం, పెనుగొండ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చారు. ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల వద్ద ఉదయం నుంచీ భక్తులు మేకపోతులు, కోళ్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.